# కృష్ణ కన్నయ్యా!

## మాదిరెడ్డి సులోచన

అందరము అమరావతి శిల్పసౌందర్యం చూడాలని బయలుదేరాం. రాత్రి దారిలో మజిలీ చేశాము. ఏ ఊరన్నది అప్రస్తుతం. ఒక ఊరు, లేదా ఎ. బి. ఏదయినా అనుకుందాము. మాది, కరుణానిధిది, రామమోహన్‌ది ముగ్గురి కార్లు హోటల్‌ముందు ఆగాయి.

"మా చెల్లెలు ఈ ఊళ్ళో ఉంది, వెడదాము. హోట లెందుకు ?" అన్నది మిసెస్ కరుణానిధి.

"అమ్మా ! ఈ బలవంతపు ఆతిథ్యం వాళ్ళ నెత్తిన రుద్దకు. మనము మన సంతోషంకోసం యెవర్నో ఇబ్బంది పెట్టటం భావ్యం కాదు " అన్నాను.

"అది నిజమేగాని బెడ్డింగు, భోజనం అన్నీ వెంట ఉన్నాక హోటల్‌వాడికి తగలెయ్యటం దేనికి ? ఒక రాత్రి కళ్ళు మూసుకుంటే గడిచిపోతుంది. మనమేం వండమన్నామా, వార్చమన్నామా ?" మిసెస్ రామమోహన్ అన్నది. ఆమెకు ఒక్క పైసా ప్రాణంతో సమానం.

"సరే మీరు వెళ్ళండి," అన్నాను. రెండు కార్లు వెళ్ళిపోయాయి. మేం గది తీసుకుని గదిలో సామాన్లు పెట్టుకున్నాం.

"నాకు కొక్కాకోలా ... కావాలి," అంటూ అబ్బాయి గంతులేస్తున్నాడు.

"మీరు ఓ గంట వీడిని బయటికి తీసుకువెళ్ళండి. కాస్త తలనొప్పి తగ్గుతుంది," అన్నాను. వాడికి ఇరవై నాల్గు గంటలు కోకకోలాలు, చాకలెట్లు, అంటూ అరవటంతోనే సరిపోతుంది. ప్రక్కవాళ్ళ తల పగిలిపోతుందన్న జ్ఞానంలేదు.

వాళ్ళు బయటికి వెళ్ళారు. మెల్లిగా దక్షిణంవైపు కిటికీ తీసి బయటకు చూసాను.

"అమ్మగారూ ! ఏమయినా తెచ్చిపెట్ట మంటారా ?"

"ఒక కప్పు వేడి టీ తెచ్చిపెట్టు," అన్నాను. కిటికీలోనుండి బయటికి చూస్తున్నాను. ఎక్కడినుండో నాకిష్ట మయిన పాట వినిపించింది.

*నల్లనయ్యా*
*కృష్ణ కన్నయ్యా !*

విరహిణి రాధ ఆలపించేవిరహగీతం. కాలేజీలో ఉండగా క్లాసులు యెగగొట్టి, నేనూ రాధ పాడుకునేవారం. రాధ గొంతులో అమృతధారలు వర్షించేవి. ఆమె ముఖభంగిమలు చూస్తుంటే రాధ, మీరా, గోపికలు కనిపించేవారు. రాధ అందాల బొమ్మ. వివాహమయి ఆరు నెలలు తిరక్కపూర్వమే చనిపోయింది.

కాని ... కాని ఈనాటి ఈ పాట అచ్చం రాధ పాడినట్టే ఉంది. ఎవరు ? ఎవరు ఆ పాడేది? పదిలంగా దాచుకున్న నా నెచ్చెలి స్మృతులు కెలికింది యెవరు?

*నా రాగానికి ప్రాణం నీవయ్యా*
*కృష్ణ కన్నయా...*

'కృష్ణకన్నయ్యా !' అనే పదం రాధ కంఠంలో ఓ ప్రత్యేకమయిన వరవడిలో పలికేది. అదే ... అదే గొంతు ! అదే మాధుర్యం ! అదే లాలిత్యం !

"అమ్మ గారూ ! టీ అండి," హోటల్ కుర్రాడు స్పూన్‌తో ట్రేను కొట్టాడు.

"ఆఁ ... వచ్చావా ? పాట వినిపిస్తే ..." అన్నాను కంగారుగా, కప్పు అందుకుంటూ.

"'మాతాజీ' పాట మీకు నచ్చిందా ? అందరికీ నచ్చింది లెండి," అతను గర్వంగా అన్నాడు.

"ఎవరా 'మాతాజీ' ?"

"ఏమోనమ్మా ! ఈ ప్రక్కన షావుకార్ల కోడలు. వివాహం కాగానే కృష్ణుడు దర్శనమిచ్చి, మాతాజీని భక్తురాల్ని చేసారమ్మా..."

"మహత్తు ఉందా ?"

"మాతాజి దగ్గరా ? చాలా మహత్తు ఉంది. షావుకార్ల వ్యాపారం మూల పడింది. ఆమె పాదమహిమవల్ల ఇప్పుడు బాగున్నారు."

"భవిష్యవాణి చెబుతుందా ?"

"ఉహుఁ ! పాట ఆపి, చిన్నగా నవ్వి అందరిని ఆశీర్వదిస్తుంది," అన్నాడు. టీ త్రాగి ఇచ్చేసాను.

*నా ఊహా రూపు నీవయ్యా !*

అదే మధురమయిన పాట ! నాకు కుతూహలంగా ఉంది. హోటల్ కుర్రాడిని వెంట రమ్మని అడిగాను. అప్పుడే సంధ్య దీపాలు వెలిగిస్తున్నారు. అతను కౌంటర్ దగ్గర గదితాళం ఇచ్చి వచ్చాడు.

"వెళ్ళండమ్మా ! ఒక్కడే అబ్బాయి లాగున్నాడు. 'మాతాజీ' నిండు మనసుతో ఆశీర్వదిస్తే మళ్ళీ ఈనాటికి కూతురు పుడుతుంది." ముసిముసిగా నవ్వాడు. ఇందాక సామాన్లు తెచ్చిన నడివయసతను.



హోటల్ కుర్రాడు దారి చూపగా ప్రశాంతమైన ఇంటి ఆవరణలో అడుగు పెట్టాను. ఒకవైపు పాతకాలపు మేడ. మరోవైపు ఆలయం ఉన్నాయి. ఆలయ ప్రాంగణంలో అచ్చు మీరాబాయిలా ఉన్న స్త్రీ చిన్న ఆసనం మీద కూర్చున్నది. ఆమె చేతిలో ఏక్‌తార ఉంది. పొడవాటి జుట్టు వీపంతా పరుచుకుంది. ఆమె ఎదురుగా, బారులు తీర్చిన స్త్రీ పురుషులు కూర్చున్నారు. నేను క్యూలో కూర్చున్నాను దూరం నుండి ఆమె వయసు అంచనా వెయ్యలేక పోయాను. పాటకంటే మృదువుగా, పొడవయిన వేళ్ళు ఏక్‌తారను మీటుతూ కనిపించాయి.

పూజ తతంగం లేదు. క్యూలో ముందుకు జరిగిన వారిని చిరునవ్వుతో తలమీద చెయ్యి పెడుతుంది, అందుకే అరగంటలో మాతాజిని చేరాను.

ఆమె కివ్వాల్సిన కట్న కానుకలు పక్కనేఉన్న వృద్ధురాలు తీసుకుంటుంది. నా తలపై చేయిపడగానే తల యెత్తాను. ఒక్క క్షణం అర్థ నిమీలిని మాతాజి నేత్రాలతో నా చూపులు కలబడ్డాయి.

"రాధా ...... రాధా ......" అప్రయత్నగా నా నోటినుండి వెలువడిం దా పిలుపు.

ఆమె కళ్ళు మూసుకుని మళ్ళీ ఏక్ తార మీటుతూ—

*కన్నయ్యా ! నిన్ను పిలిచేరు రావయ్యా.*
*రాధ మనసులో మాధవుడివి వయ్యా*

అదే కంఠం, అదే మధురిమ. వెనుక వచ్చే భక్తులను చూసాక ముందుకు జరక్కతప్పలేదు. ముసలమ్మ దగ్గర ముడుపు చెల్లించి బయటకు వచ్చాను. అదెలా సాధ్యం ! రాధ... మా రాధ. ఒక్కనాటి పరిచయమా. మూడేళ్ళు కలిసి చదివాము. మనిషిని పోలిన మనిషి ఉంటాడు. ఎక్కడో కాస్త భేదం ఉంటుంది. సినిమా కాదు ఒకే వ్యక్తి డబుల్ యాక్షన్ చెయ్యటానికి.

"ఇంత చిన్న వయసులో భగవత్ సాక్షాత్కారం జరిగిందంటే అదృష్ట వంతురాలే."

"పూర్వజన్మ సుకృతం."

భక్తులు అనుకుంటూ వెడుతున్నారు. నేనేంచేయాలో తోచలేదు. ఒక్కక్షణంలో మహత్తు, మహిమ ఏమీ కనిపించలేదు. ఆ క్షణంలో కనిపిస్తే గారడీ అవుతుందేమో. మెల్లగా గదికి వచ్చాను. నన్ను చూసి మావారు నవ్వారు.

"ఏం ఆత్మబలం క్షీణించిందా, శాస్త్రీయ దృక్పథం సన్నిగిల్లిందా ?" అని అడిగారు. ఎప్పుడూ, అమ్మలు, బాబాలు, స్వాములు అంటూ చర్చ వస్తే నేను ఖండించడం కద్దు.

"ఆధ్యాత్మిక చింతనతో, ఈ ప్రాపంచిక సుఖాలకు, విషయాలకు దూరంగా బ్రతకటం హర్షించతగ్గదే కాని, ఈ అమ్మలను, బాబాలనూ



నమ్ముతూ మరో దేవుడని కొలువటం మానసికబలం లోపించటమో, శాస్త్రీయ దృక్పథం తెలియకో కావాలి," అనే దాన్ని. అందుకే వెటకారం చేసారు.

"అందుకు కాదండి... ఆమె మా రాధండి... రాధ పాటలు పాడేదని చెప్పేదాన్ని, ఆ రాధ".

"ఆ చనిపోయిన రాధ బ్రతికి వచ్చిందా! పద, పద. మళ్ళీ ఉదయం లేస్తూనే డ్రైవ్ చేయాలి."

వెళ్ళి భోజనం చేసి వచ్చి పడుకున్నా రాధే గుర్తుకు వస్తుంది. నాకు నిదుర రావటంలేదు. కిటికి తీసుకుని చూసాను. పదిగంటలకు పాటలు ఆగిపోయాయి. మెల్లగా వచ్చి పడక మీద నడుము వాల్చాను. బయట బెల్ నౌక్కారు యెవరో. లేచి తలుపులు తీసాను. తుఫానులా వచ్చాడు రామ్మోహన్.

"అబ్బ ఏం ఇల్లండీ అది! బయట పడుకొమ్మన్నారు. దోమలు చంపుతున్నాయి. మీరు ఏమనుకున్నా సరే, ఈ సోఫాలో పడుకుంటాను..." అతను సోఫాలో నడుము వాల్చాడు. పదకొండు గంటలకు వచ్చిన మనిషిని యెలా తరుముతాము!

అతనికో బెడ్ షీటిచ్చి, లైటు ఆర్పాను. మళ్ళీ బెల్ వినిపించింది. మిసెస్ రామ్మోహన్ అయి ఉంటుంది అనుకున్నాను. భలే మనుష్యులు! లేచి తలుపు తీసాను. ఈసారి యెవరో అపరిచితుడు నిల్చున్నాడు.

"క్రాంతి అంటే..."

"నేనే..." అన్నాను.

"మాతాజీ మిమ్మల్నొక్కసారి రమ్మంటున్నారు," అన్నాడు. వెంటనే వారిని లేపి విషయం చెప్పాను.

"ఆఁ... పొద్దున వస్తామని చెప్పు."

"నాకేం భయం లేదండి. నేను వెళ్ళి వస్తాను," అన్నాను. నాపేరు చెప్పిందంటే ఆమె రాధే అయి ఉంటుంది.

"ఊఁ... నీ జిజ్ఞాస కాదు కాని ప్రాణాలు తీస్తావ్..." ఆయన లేచి వచ్చాడు.

మేము పాతకాలపు మేడలోకి వెళ్లాము.

"మీ రిక్కడ కూర్చోండి సార్ ... మాతాజీ ఆమెను మాత్రమే రమ్మన్నారు" అన్నాడు. మావారు హాల్లో ఉన్న పేము కుర్చీలో కూర్చున్నారు. నేను పైకి వెళ్ళాను. ఓ గది తలుపు తట్టగానే ఓ ముప్పయి అయిదేళ్ళ వ్యక్తి బయటకి వచ్చాడు. అతని పోలికలు బట్టి, రాధ భర్తగా గుర్తించాను. నేను లోపల అడుగు పెట్టగానే, రాధ తలుపు వేసింది, ఆమె ఇప్పుడు వేలుముడి వేసుకున్నది.

"ఏమిటి క్రాంతీ ! చనిపోయిన రాధ యెలా బ్రతికిందనా !" నవ్వుతూ నా భుజాలమీద చేతులు వేసింది.

"రాధ... రాధా నువ్వేనా ?"

"నేనే క్రాంతీ !" ఆమె నా చెయ్యి పట్టి తీసుకు వెళ్ళింది. ఇద్దరం మంచం మీద కూర్చున్నాము. రాధ వెలికిలా పడుకుంది.

"క్షమించు క్రాంతీ ! నడుము నొప్పి పుడుతుంది. అయిదు గంటల నుండి ఒకే పొజిషన్‌లో కూర్చోవటం నరకమే అనుకో..."

"రాధా... ఏమిటీ నాటకం ! నువ్వు మాతాజీవి ఎప్పు డయ్యావు ?" కాస్త ఆవేశంగా అడిగాను.

"ఏమిటోయ్; అంత అనుమానం ! ముప్పై ఏళ్ళ మాతాజీ అంటే యెంత గ్లామరు, ఏం కథ... ఆ:..." అన్నది. నవ్వుతూ.

"ప్లీజ్ రాధా! నన్ను ఇంకా చిత్రవధ చెయ్యకు..."

"నా గురించి తెలుసుకోవాలనే జిజ్ఞాసతోనే నువ్వు చిత్రవధ అనుభవిస్తుంటే, రోజూ ఈ నాటకం ఆడలేక నేనెంత చిత్రవధ అనుభవిస్తున్నానో నీకేం తెలుసు..."

"ఎందుకీ నాటకం ! చెప్పు రాధా... చెప్పు.

"చెబుతాను......" రాధ కళ్ళు మూసుకుంది.

"క్రాంతీ ! మా అత్తగారిని చూసి దైవభక్తిగల కుటుంబం అంటూ మావాళ్లు మురిసిపోయారు. నేను సంతోషించాను. వివాహమయి, తొలిరాత్రి గడిపాక గాని వాళ్ళెంత అంధకారంలో బ్రతుకుతున్నారో అర్థంకాలేదు. నా భర్త 'రాజేశ్వరీదేవి' అనే అమ్మవారి భక్తుడు. కోటి కోర్కెలతో అడుగుపెట్టిన నన్ను చేరదీయకపోగా, పద్మాసనం వేసుకుని కూర్చుని, 'రాధా ! మనకు సుపుత్రుడు కలగాలంటే, కఠోర నియమబద్ధులమై మండలం రోజులు అమ్మవారిని సేవించి మనం ఏకం కావాలి,' అన్నారు. ఏం చేయాలో చెప్పు ? నలభై రోజులు నరకయాతన అనుభవిస్తూ, వారు మంచంమీద పడుకుంటే కటికనేలపై పడుకున్నాను. ఆ తరువాత ఒక్కరోజు దాంపత్య జీవితం అనుభవించాము.

"గాంధీగారు ఏమని సెలవిచ్చారో తెలుసా తుచ్ఛమైన కోర్కెలతో కాదు, దాంపత్య జీవితం గడిపేది. సంతానం కోసం..." అంటూ మళ్ళీ నన్ను దూరం ఉంచారు. మూర్ఖత్వమో, అధ్యాత్మిక చింతనో అర్థంకాలేదు అతడిని నిలదీసి అడిగితే ఏవో పిట్టకథలు చెప్పేవారు.

వయసు, మనసున్న మనిషిగా ఏం చేయాలి చెప్పు ? అనుకోకుండా ... అనుకోకుండా..." చెప్పలేకపోయింది.

"ఏం జరిగింది రాధా ?"

"ఏం జరుగకూడదో అదే జరిగింది క్రాంతీ ! మా ప్రక్కటింట్లో ఉన్న ముస్లిమ్ యువకుడికి నన్ను నేను అర్పించుకున్నాను. నా కోర్కెలు పండించుకున్నాను."

"అది నీ పొరపాటు కాదు రాధా ! నీ భర్త మూర్ఖత్వం," అన్నాను. మనిషికి లైంగిక జీవితంకూడా బయలాజికల్ అర్జ్, నీడ్ అంతే.

ఆ విషయము ఇంట్లోవారికి తెలియగానే, మా వాళ్లను పిలిపించారు. మావాళ్ళు నేను చచ్చిపోయానని దుమ్మెత్తిపోసి వెళ్ళిపోయారు. మా అత్తవారికి రాజేశ్వరమ్మ ఏం చెప్పిందోగాని వాళ్ళు వచ్చారు.

"నిన్ను క్షమించి, యెవరూ పొందనంత గౌరవాన్ని ఇప్పిస్తాము. మేము చెప్పినట్టు వినాలి," అన్నారు.

"ఏమిటి?" కుతూహలంగా అడిగాను.

"రాజేశ్వరమ్మ శిష్యబృందంలో చేరిపోవాలి, ఉపదేశం పొందాలి. ఆమె చెప్పినట్టు నటించాలి. నీకు రోజూ నీ ప్రియుడితో సమాగం దొరుకుతుంది. కావల్సినంత పేరు..."

"నా కిష్టం లేకపోతే ?" అన్నాను.

"మా సంగతి తెలియదు. మా పరువు ప్రతిష్టలకోసం ఏమయినా చేస్తాం. నీ ప్రియుడు ఈ లోకంలో ఉండడు ..." అన్నారు, క్రాంతీ. ఆ క్షణంలో ఏం గుర్తురాలేదు. ఆరాధనా, అభిమానంతో చూసే అతని ముఖం కనిపించింది. అంగీకరించాను. నేను ఏమయిపోయినా పరవాలేదు, కాని ... కాని ... నాకు అమర సుఖాలు చూపించిన అతడు మరణించటానికి వీల్లేదనిపించింది. ఆ రోజునుండి అమ్మవారి ముఖ్య శిష్యురాలిని అయ్యాను. ఆమె పోయాక మాతాజీగా రూపు దాల్చాను. గొర్రెదాటు జనము. భక్తితో పాటు, మాకు భుక్తికి కష్టపడకుండా కానుకలు ఇచ్చిపోతారు. నా నెలసరి ఆదాయం అయిదారు వేలుంటుంది. కొందరు నగలిస్తే, కొందరు నాణ్యాలిస్తారు. ధాన్యం కొలుస్తారు..."

"ఇదంతా మోసంకాదా?" అరిచాను.

"క్రాంతీ ! ఆవేశపడుతున్నావు. వేషంతో మోసంచేసి బ్రతుకవచ్చని అనుకున్నప్పుడు, కష్టపడేది ఎవరు చెప్పు ?" రాధ నవ్వుతూ అడిగింది.


"విద్యావంతురాలివి, వివేకం కలదానివి. ఈ అవతారాలు యెత్తటానికి సిగ్గులేదూ ?"

''క్రాంతీ! నీకు వీలుంటే ఈ పూట వచ్చిచూడు. నా ఆశీస్సులకు వచ్చేవారు విద్యాధికులు, విదేశాలకు వెళ్లేవారే."

"అందరికీ అసలు సంగతి చెబుతాను. నీ బండారం బయటపెడతాను."

"ఎంత అమాయకురాలివి క్రాంతీ!" పగలబడి నవ్వింది.

"నాకు వ్యతిరేకంగా ఒక్క మాటన్నా, ఈ చుట్టుపట్ల నిన్ను బ్రతుక నివ్వరు. మన జనం ఆలోచించే స్థితిలో లేరు..." అన్నది జాలిగా.



నాకేం తోచలేదు. రాధ అన్న మాటలు అబద్ధం కావని తెలుసు. ఒకటి రెండుసార్లు జిజ్ఞాసతో బాబాల, అమ్మల, స్వాముల మహత్తేమిటని విద్యావంతులను అడిగితేనే, వాళ్లు 'నువ్వుమూర్ఖురాలన్నట్టు' చూశారు అందుకే మౌనం వహించాను.

"ఏమాలోచిస్తున్నావు క్రాంతీ! నన్ను ఏ విధంగా ఎక్స్‌పోజ్ చెయ్యాలనా?"

''కాదు రాధా! నీ మహిమలు అందరూ యెలా నమ్ముతారు?" ఆశ్చర్యంగా అడిగాను.

మా మరుదులు, ఆడపడుచులు భక్తులలో చేరిపోతారు. నా గురించి ప్రచారం చేస్తారు."

''ఓహ్...! రాధా, ఈ విషయము ఈనాడు బయటపెట్టక పోయినా ఏదో ఒకరోజు వ్రాస్తాను."

"నువ్వు వ్రాసినా మా వాళ్ళు నలు మూలలనుండి నిన్ను ఖండిస్తూ, నా మహిమలు కీర్తిస్తూ వ్రాస్తారు. వెర్రిదానా! ఈ వ్యవస్థ మార్చి, మనిషిని ఆలోచింపచేయటానికి మహత్తుగల మహాత్ముడు అవతరించాలి ... పోనీ యెక్కడికి వెడుతున్నావ్?"

చెప్పాను. రాధ నా భుజం తట్టి, నవ్వింది.

"విష్ యు గుడ్ లక్. పిల్లలు..."

"ఒకబ్బాయి..." అన్నాను.

"అయితే ప్రభుత్వానికి నీ పూర్తి సహకారం అందిస్తున్నా వన్నమాట." నవ్వింది. మరో అరగంట కూర్చొని, అందరి విషయా లడిగితే జవాబు చెప్పి బయటకు వచ్చాను.

"సారీ క్రాంతీ! నా చేతి కాఫీ, పండ్లరసం కూడా త్రాగవని తెలుసు. అందుకే ఏం ఇవ్వలేదు."

"ఫరవాలేదు... నీ స్వార్థమే కాని ఈ అమాయకులను మభ్యపెట్టడం మాన వన్నమాట..."

"ఎందుకు మానాలి?" ప్రభుత్వ యంత్రాంగమే నా మహిమ లాంటిది. అక్కడ మార్పు వస్తుందా, మోసం లేదా? అది మార్పు..."

జవాబు చెప్పలేనట్టు క్రిందికి వచ్చి, ఆయన కునుకు తీస్తుంటే లేపాను. తిరిగి చూడకుండా గదిలోకి వచ్చాను. రామ్మోహన్ హాయిగా, బాబు ప్రక్కన పడుకుని నిదరపోతున్నాడు. మావారు లేపబోయారు.

"పోనివ్వండి..'' అని సోఫాలో కూలబడ్డాను. నిద్ర వస్తుందేమో ఆయన ఏం అడుగలేదు. రాత్రంతా ఆలోచిస్తూనే ఉన్నాను.

*కన్నయ్యా...కృష్ణ కన్నయ్యా!*

పాట వినిపించింది. వెళ్ళి విసురుగా తలుపు వేసాను. నిశ్శబ్ద వాతావరణంలో స్పష్టంగా వినిపిస్తోంది. గబగబా మా వారిని లేపాను.

"అబ్బబ్బ ఏమిటి?"

''త్వరగా వెళ్దాం..." ఆయన విసుక్కుంటూ ప్రయాణం అయ్యారు. విషయం మూడు ముక్కల్లో చెప్పాను.

"ఆ పాట నా గుండెలను చీల్చి వేస్తుంది. ఇంకొక్క క్షణం ఉన్నా నేను వెళ్ళి రావతో తగవుపడాలి ..." అన్నాను.

రామ్మోహన్ వాళ్ళను వచ్చి ఆ తరువాత ఊళ్లో కలవమని బయలుదేరాం ... దూరంగా వినిపిస్తూనే ఉందా పాట కృష్ణకన్నయ్యా అంటూ.